

బ్యాంకు ఖాతాదారులు కేవైసీకి పత్రాలు ఇవ్వాలి

నస్పూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఖాతాదారులు తమ ఖాతాలను కేవైసీకి ఆధార్, పాన్ కార్డులను అనుసంధానం చేసుకోవాలని సీతారాంపల్లి శాఖ మేనేజర్ నర్సింహా స్వామి ఒక ప్రకటనలో తెలిపారు.

రెండేళ్ల ఖాతా నిర్వహణ లేని, పది సంవత్సరాలుగా వినియోగం లో ఉన్న, ఆ పైబడిన ఖాతాదారులు వెంటనే బ్యాంకును సందర్శించి కేవైసీ కోసం పత్రాలను అందజేయాలన్నారు. రెండు సంవత్సరాలు, 10 సంవత్సరాలు, ఆ పైబడి ఖాతాదారులు నుంచి వినియోగంలో లేని ఖాతాదారులు త్వరగా కేవైసీ కొరకు ఆధార్, పాన్ కార్డులను అనుసంధానం చేసుకుని బ్యాంకు ప్రయోజనాలను పొందాలన్నారు.

ఇంటి స్థలాలు అమ్మడం, కొనడం చేయరాదు

మంచిర్యాలకలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : టీఎన్‌జీవో హౌజింగ్ సొసైటీ సభ్యులకు కేటాయించిన నస్పూర్ శివారులోని సర్వే నెంబరు 42 లోని ఇంటిస్థలాలను సభ్యులు అమ్మడం, కొనడం చేయరాదని టీఎన్‌జీవో అధ్యక్షుడు శ్రీహరి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎన్‌జీవో హౌజింగ్ సొసైటికి సంబందం లేని ఇతర వ్యక్తులు కూడా ఇంటి స్థలాలు మావేనని ఇతరులను నమ్మించి అమ్ముతున్నట్లు సంఘం దృష్టికి వచ్చిందన్నారు. ఒక వేళ ఇది రుజువైతే అమ్మవారిపై కొన్నవారిపై సంఘం చట్టరీత్య చర్యలు తీసుకుం టుందని తెలిపారు. అయినా ఎవరైనా కొనుగోలు చేసి మోసపోతే తమ సంఘం ఎలాంటి బాధ్యత వహించదన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు మొండయ్య, రామ్మోహన్, రాజమైళి, గోపాల్, కళావతి, ప్రసాద్ పాల్గొన్నారు.

బంగారం, వెండి అమ్మకాల్లో చేతివాటం..?



- హాల్‌మార్క్ పేరుతో బంగారం విక్రయాలు
- ప్యూరిటీ పేరిట గిల్టు వెండి నగల తయారీ
- అనుమతులు లేకుండానే ముద్రలు వేస్తున్న వైనం
- అక్రమ మార్గంలో కోట్లు గడిస్తున్న వ్యాపారులు

మంచిర్యాల, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): బంగారం, వెండి అమ్మకాల్లో కొందరు వ్యాపారులు అక్రమ మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ప్రజలకు బంగారం, వెండి ఆభరణాలపై ఉన్న మక్కువను క్యాష్ చేసుకునేందుకు కొత్త పుంతలు తొక్కుతున్నారు. అసలైన సరుకు పేరుతో ప్రజలకు నకిలీ వస్తువులు అంటగడుతూ నిలువునా మోసగిస్తున్నారు. హాల్‌మార్క్, ప్యూరిటీ పేరుతో అనుమతులు లేకుండా ముద్రలు తయారు చేస్తూ బంగారు, వెండి బిస్కెట్లపై ముద్రించడమేగాక వాటిని ప్రజలకు విక్రయిస్తూ కోట్లకు పడగలెత్తుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏది అసలో, ఏది నకిలిదో తెలియని ప్రజలు వాటిని కొనుగులు చేస్తూ నిలువునా మోసపోతున్నారు. గతంలో సైతం జిల్లాలో ఈ తతంగం చోటు చేసుకోగా, పోలీసులు కొరఢా ఝుళిపించడంతో అవినీతి దందా నిలిచిపోయింది. అయితే ఇటీవల కొన్ని చోట్లా మళ్లీ గుట్టు చప్పుడు కాకుండా అక్రమ దందాను నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

హాల్‌మార్క్ నగలంటూ దోపిడీ...

హాల్‌మార్క్ పేరుతోనూ వినియోగదారుల జేబులకు చిల్లులు పెడుతున్నట్లు బాహాటంగా ప్రచారం జరుగుతోంది. గతంలో చెన్నూరు కేంద్రంగా ఈ హాల్‌మార్క్ దందా యథేచ్ఛగా సాగింది. చెన్నూరులో ప్రత్యేకంగా ఓ బంగారు బిస్కెట్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఒడిశా నుంచి నిపుణున్ని రప్పించి, పాత బంగారాన్ని కరిగిస్తూ అందులో కల్తీ కలిపి బిస్కెట్ల రూపంలో తయారు చేస్తున్న విషయం పోలీసులకు ఉప్పందగా, దాడులు జరిపి అక్రమ దందాకు చెక్ పెట్టారు. బ్రాండెడ్ కంపెనీలను పోలి ఉన్న అచ్చులతో బిస్కెట్లు తయారు చేస్తుండగా, అసలు బంగారం కంటే రూ. 3 వేల వరకు తక్కువ రేట్లకు విక్రయిస్తున్న విషయం విచారణలో తేలింది. దీంతో అక్కడ బంగారం కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి కనబరిచారు. నిబంధనల మేరకు హాల్‌మార్క్‌తో కూడిన బంగారాన్ని విక్రయించా లంటే పూర్తిస్థాయి నాణ్యత కలిగి ఉండాలి. కానీ చెన్నూరులో తయారైన బిస్కెట్లలో నాణ్యత లేకపోయినా ముద్రలు వేయడం కొసమెరుపు. పైగా ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించకుండా అక్రమంగా అచ్చులు ఉపయోగిస్తూ కోట్లకు పడగలెత్తారు. ఈ అక్రమ దందా పై బంగారం వ్యాపారుల అసోసియేషన్ దృష్టిసారించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు గుట్టు బయటపడింది.

వెండి ప్యూరిపై పేరుతో...

మంచిర్యాల జిల్లా కేంద్రంలో వెండి ప్యూరిపై పేరుతో కొందరు వ్యాపారులు మోసాలకు పాల్పడుతూ అందినకాడికి దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొంతకాలంగా పట్టణంలో వెండి ముద్దలను కరిగించి వాటిపై ఎలాంటి అనుమతులు లేకుండా ప్యూరిటీని తెలిపే స్వస్తిక్ ముద్రలు వేస్తూ దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ అనుమతులతో బంగారం, వెండి నాణ్యతను తెలిపే ముద్రలు వేసే అధికారం కేవలం ఇప్పటి వరకు హైద్రాబాద్‌లోనే ఉంది. అక్కడ బంగారం, వెండితో తయారైన బిస్కెట్లు, ముద్దలను నిబంధనల మేరకు పరీక్షించి, అసలైనవిగా నిర్ధారణ అయితే ముద్రలు వేయడంతోపాటు ధృవీకరణ పత్రాలు అందజేస్తారు. జిల్లా కేంద్రంలో ఎలాంటి అనుమతులు లేకుండా అసలు ముద్రలను..

(తరువాయి 9లో)

నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

హాజీపూర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లాలోని హాజీ పూర్ మండలం గుడిపేటలో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీ సుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.

బుధవారం గుడిపేటలో నిర్మితమవుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలకు మరింత వేగవంత మైన వైద్యసేవలను అందిం చేందుకు వైద్యులు, సిబ్బంది సంఖ్యను పెంపొందించేందుకు 216 కోట్ల రూపాయల నిధులతో నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో నిర్మిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణపనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

పద్మల్‌పురి కాకో ఆలయంలో ఆదివాసీల జాతర



కాకో అమ్మవారిని దర్శించుకుంటున్న గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి

దండేపల్లి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిరేవు పద్మల్‌పురి ఆలయానికి ఆదివాసీలు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివాసీలు పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు ఆదివాసీలు డప్పువాయిద్యాలతో గుస్సాడీ వేషధారణలు, నృత్యాలతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి జలాభిషేకం చేశారు. అనంతరం రకరకాల పిండి వంటలు చేసి కోళ్లలను, మేకలను అమ్మవారికి బలి ఇచ్చారు. ఆలయంలో ఆదివాసీలతో గుస్సాడి నృత్యాలతో సందడి చేశారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర గిరిజన కో-ఆపరేటివ్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరు పతి, ఆలయకమిటీ చైర్మన్ కోమురం హన్మంత్‌పటేల్, కమిటీ నిర్వహకులతో కలిసి పద్మల్ పూరీ కాకో ఆలయాన్ని సందర్శించి, గుస్సాడి దర్బార్ ఏర్పాటు తీరును పరిశీలించి, కాకో అమ్మవారిని దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుస్సాడిలకు కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి పారితోషకం అందజేశారు.

రేపు గుడిరేవులో గుస్సాడీ దర్బార్

గుడిరేవు పద్మల్‌పూరీ ఆలయంలో ఈనెల 17 శుక్రవారం గుస్సాడీ దర్బార్ నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ చైర్మన్ కొమురం హన్మంత్‌పటేల్, నిర్వహణ కమిటీ చైర్మన్ ఆత్రం జలపతి, గౌరవాధ్యక్షుడు కనక జంగులు తెలిపారు. ఆదివాసి సంస్కృతీ సంప్రదాయాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించే గుస్సాడీ దర్బార్‌కు మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలతో గిరిజన కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, ఐటీడీఏ పీవో పాటు, జిల్లా ఉన్నత అధికారులు హాజరుకానున్నారు. దర్బార్ వేడుకలకు ఉమ్మడి జిల్లాతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి ఆదివాసి గిరిజనులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల ప్రజలు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పశువులకు టీకాలను వేయించాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. బుధ వారం కలెక్టర్ చాంబర్‌లో కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి నవంబర్ 14 వరకు టీకాల కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లాలోని పశువుల యాజమానులు పశువులకు తప్పనిసరిగా టీకాలను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసం వర్ధక శాఖ అధికారి శంకర్, అధికారులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి



మంచిర్యాలలో ధర్నా చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని, బీసీలకు రిజర్వేషన్ రాకుండా బీజేపీ అడ్డుకోవడం తగదని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వనం సత్యనారాయణ, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నరెండ్ల శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు ఇచ్చే విధంగా జీవోను తీసుకు వచ్చి షెడ్యూలు ప్రకటించినా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆమోదించనందునే ఎన్నికలు ఆగిపోయాయమన్నారు. బీసీలను ఇంకెన్నాళ్లు వెనకబడేస్తారని, బీసీలు రాజకీయంగా ఎదిగేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. వెంటనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్‌లు ఇస్తున్నట్లుగా చట్టం తీసుకువచ్చి బీసీలకు న్యాయం చేయాలన్నారు. లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల దాసు, కలీందర్‌ఆలీఖాన్, లింగం రవి, కుంచాల శంకరయ్య, దేవి పోచన్న, కొట్టే కిషన్‌రావు, జోగుల ఆంజనేయులు, బొడ్డు లచ్చన్న, పోలు, బానేష్, రాజమౌళి, రామన్న, సాంబయ్య, రాజేశం, రవి,మ ఒండి, రాజేశం, రాయమల్లు, జోసెఫ్, భాస్కర్, వంశీ, శంకర్, అంజన్న పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

- 3 తులాల బంగారం, 10 తులాల వెండి అపహరణ

లక్షెట్టిపేట, అక్టోబరు, 15 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని మహా లక్ష్మీవాడలో తాళంవేసి ఉన్న రెండు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పట్టణానికి చెందిన వెల్పుల లింగయ్య, రాచర్ల సరళ ఇద్దరు పని నిమిత్తం వాళ్ల ఇళ్లకు ఈనెల 13 నతాళం వేసి బంధువుల ఊళ్లకు వెళ్లారు. బుధవారం ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగుల గొట్టి ఉన్నాయి. ఇంట్లో బీరువాలో ఉన్న సుమారు మూడు తులాల బంగారం 10 తులాల వెండి సామగ్రి దొచుకుపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్సై సురేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు అవగాహన

కెరమెరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో బుధవారం షీ టీం సభ్యుల ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ విద్యార్థినులకు భద్రతా చట్టాలు, అపద సమయంలో ఎలా స్పందించాలి, డయల్ 100, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు, ఈ వ్‌టీజింగ్, సైబర్ క్రైం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వేధింపులకు గురైనట్లయితే వెంటనే 8712670564 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్సై బిక్కాలాల్, ప్రిన్సిపాల్ ప్రవీణ, షీటీం సభ్యులు స్వప్న, రజిని, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

వాంకిడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ కోసం దరఖా స్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ మొహమ్మద్ గౌస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హౌజ్‌వైరింగ్, సెల్ ఫోన్ రిపేరింగ్, ఫొటోగ్రఫీ, సీసీ టీవీ ఇన్స్టాలేషన్, ఫ్రిడ్జ్ రిపేరింగ్, ఏసీ రిపేరింగ్, బైక్ మెకానిక్, మెన్స్ టైలరింగ్ కోసం శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత బస్సు చార్జీలు, భోజన వసతి, రెండు జతల ఫామ్స్, టూల్ కిట్స్ శిక్షణ అనంతరం ధ్రువ పత్రాలు అందించనున్నామని తెలిపారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు పదో తరగతి చదివిన నిరుద్యోగులు అర్హులని తెలిపారు. ఈ నెల 31వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అడుగుకో గుంత..

- రూ. కోట్లు వెచ్చిస్తున్నా మారని రోడ్ల పరిస్థితి
- అంతర్గత రహదారులు మరీ అధ్వానం
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



కాగజ్‌నగర్ ఎన్టీఆర్ చౌరస్తాలో గుంతలమయంగా మారిన ప్రధాన రోడ్డు

కాగజ్‌నగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రోడ్డుపై పలు చోట్ల గుంతలు పడ్డాయి. ఈ గుంతలు ప్రమాదకంగా మారడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు వీటికి శాశ్వత దిశగా చర్యలు తీసుకోకుండా కేవలం కంటి తుడుపుగా మట్టితో నింపేస్తున్నారు. మళ్లీ వర్షాలు కురిసిందంటే చాలు ఎప్పటి పరిస్థితే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఆసిఫాబాద్ నుంచి కాగజ్‌నగర్ వచ్చే ప్రధాన రోడ్డు పెద్దవాగు వంతెన మూలు మలుపు వద్ద గుంతలున్నాయి. ఇదే మార్గంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద కూడా పలు చోట్ల గుంతలు పడడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ప్రధాన రహదారిపైనా..

సిర్పూరు-బెజ్జూరు, కాగజ్‌నగర్-దహెగాం, కాగజ్‌నగర్-బెజ్జూరు వెళ్లే ప్రధాన రహదారిలో పలు చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. గత నెలలో ఈ ప్రధాన రోడ్డుపై రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో కూడు ఇద్దరు మృతువ్రాత పడ్డారు. ఇందులో పట్టణానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు అజీం అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే వివిధ సంఘటనల్లో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదాలు జరుగుతున్న పెద్దవాగు సమీపంలోని గుంతలను రూరల్ ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో గుంతలను పూడ్చడంతో సమస్య తీరింది. కానీ ఎన్టీఆర్ చౌరస్తాలో గుంతలు విపరీతంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

వాహనదారులు ఈ రోడ్డుమీదుగా పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇక వర్షం కురిసిందంటే ఈ గుంతల్లో నీరు చేరి గుంతలు ఏర్పడక వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. బస్సులు, లారీల పట్టీలు కూడా విరిగి పోతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ వెళ్లే ఈ మార్గంలోనే భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తరుచూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో అధిక బరువులకు గుంతలు మరీ పెద్దవై పోతున్నాయని చెబుతున్నారు. చింతలమానేపల్లి మండలం కర్జెల్లి-గూడెం వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. భారీ వార్షలకు పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ మార్గంలోనే మహారాష్ట్రలోని అహిరికి వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుదెబ్బతినడంతో ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. కెరమెరి మండల కేంద్రం నుంచి అనార్‌పల్లి వెళ్లే మార్గంలోని దేవాపూర్ సమీపంలో కూడా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. తిర్యాణి శివగూడసమీపంలో లోలెవల్ వంతెన కోతకు గురవడంతో మానిక్‌పూర్, మెస్రగూడ వాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. పెంచికల్‌పేట మండలంలోని మొర్లిగూడ రోడ్డు వర్షాలకు కోతకు గురైంది. ఈ ప్రాంతంలో ప్రజలు ఆ రోడ్డుమీదుగా రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వాహనదారుల అవస్థలు..

సూర్యప్రకాష్, కాగజ్‌నగర్



గుంతలు పడిన రోడ్లపై రాకపోకలకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు నిండి కన్పించకుండా ఉంటుంది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి రోడ్లపై ఉన్న గుంతలను శాశ్వతంగా పూడిస్తే బాగుటుంది. అధికారులు ప్రమాదాలు జరుగ కుండా వెంటనే చర్యలు తీసుకోవాలి.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య

చికిత్స పొందుతూ మృతి



బక్కన్న(ఫైల్)

నెన్నెల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గంగారం గ్రామానికి చెందిన కౌలురైతు కడారి బక్కన్న (41) గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. బక్కన్న తన ఇంటి వద్ద ఈ నెల 3న గడ్డి మందు తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆసుత్రికి, అక్కడి నుంచి వరంగల్‌కు తరలించారు. ఎంజీఎంలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. బక్కన్న కుటుంబీకులు చెప్పిన వివరాల ప్రకారం వివరాలిలా ఉన్నాయి. బక్కన్న మూడు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేస్తున్నాడు. పంట పెట్టుబడి కోసం రూ. 2 లక్షల వరకు అప్పు చేశాడు. అధిక వర్షాలతో పంట దెబ్బతినడంతో కుంగిపోయాడు. పంట దెబ్బతినడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలంటూ కుటుంబ సభ్యుల వద్ద బాధపడేవాడు. చివరకు అప్పులు తీర్చే దారి లేక ఇంటి వద్దనే ఈనెల 3వ తేదీన గడ్డిమందు తాగాడు. వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. బక్కన్నకు భార్య ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపారు.

అర్చకుడి అత్యాచారయత్నం..?

ఆలయ ఈవోకు ఫిర్యాదు చేసిన బాధిత కుటుంబ సభ్యులు

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో గల శ్రీబుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో పని చేస్తున్న ప్రధాన అర్చకుడు మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఓ మహిళ ఆలయ ఈవోకు ఫిర్యాదు చేసింది. కన్నాల గ్రామంలో గల శ్రీబుగ్గరాజరాజేశ్వర దేవస్థానానికి ఈ నెల 6న రామకృష్ణాపూర్‌కు చెందిన కుటుంబం మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చారు. ఈ క్రమంలో ఆలయ అర్చకుడు వారితో మాట్లాడాడు. సదరు మహిళా భక్తురాలు సంతానం కలుగలేదని, శివుని పూజ కోసం మొక్కులు చెల్లించడానికి వచ్చామని అర్చకులకు తెలియజేశారు. దీంతో అర్చకుడు మహిళా భక్తురాలితో ఇంటికి వచ్చి పూజలు నిర్వహిస్తే సంతానభాగ్యం కలుగుతుందని సదరు మహిళతో, కుటుంబ సభ్యులతో నమ్మబలికాడు. మరుసటి రోజు 7న వారు నివాసముండే రామకృష్ణాపూర్ పట్టణానికి అర్చకుడు పూజల నిమిత్తం వెళ్లాడు. ఈ క్రమంలో ఇంట్లో బాధిత మహిళతో పాటు ఆమె తల్లి కూడా ఉంది. ఆమె తల్లిని ఇంట్లో నుంచి బయటికి వెళ్లాలని సూచించాడు. అనంతరం బాధిత మహిళను ఇంటిలోని ఓ గదిలోకి తీసుకెళ్లి పూజలు చేస్తానని గడియ పెట్టాడు. తన వద్ద ఉన్న పసరును తన చేతులతోనే ఒళ్లంతా రాయాలని అప్పుడే పిల్లలు పుడుతారని మహిళకు చెప్పాడు. దీనికి సదరు మహిళ ఒప్పుకోకపోవడంతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. సదరు మహిళ ప్రతిఘటించి అర్చకుడిని నెట్టేసి తలుపుగడియ తీసుకొని బయటకు వచ్చింది. గదిలోపల జరిగిన తతంగమంతా తన తల్లికి తెలిపింది. దీంతో కలత చెందిన కుటుంబ సభ్యులు సదరు అర్చకుడిపై ఈవో బాపురెడ్డికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి పోలీసులను కూడ ఆశ్రయిస్తామని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

సిర్పూర్(టి), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మొదటి విడతలో మంజూరైన ఇందరిమ్మ ఇళ్ల పనులను లబ్ధిదారులు పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. బుధవారం మం డలంలోని లక్ష్మీపూర్, పారిగాం, టోంకిని, తదితర గ్రామాల్లో తదితర గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు చేశారు. ఆయన వెంట కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

ఎస్పీఎంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బుధవారం కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు చాలా కాలంగా జరగక పోవడంతో కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రిన్సిపల్ సెక్రటరీకి లేఖ అందజేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లోని డీపీవీ లక్ష్మీపత్ సంఘానియా పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. అండర్-14 బాలికల విభాగంలో 32-34కిలోలు, 48-50 కిలోల బరువు కేటగిరీలో పాఠశాలకు చెందిన పూర్వ, నితిక్షలు విజయం సాధించారు. ఈ మేరకు విద్యార్థినులను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు అభినందించారు.

పంటల వివరాల నమోదు

చింతలమానేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్జవెల్లి గ్రామంలో ఏఈవో సంపూర్ణ రైతులు సాగు చేసిన పంటల వివరాలు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటల వివరాలను రైతులు తప్పని సరిగా నమోదు చేసుకోవాలని చెప్పారు. దీని ద్వారానే పంటల విక్రయాలు చేసుకోవచ్చని తెలిపారు. రైతులు తప్పనిసరిగా అధికారులతో పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆకాంక్షిత బ్లాక్‌లో భాగంగా జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. న్యూఢిల్లీ నుంచి నీతి అయోగ్ సీఈవో రజత్‌కుమార్‌సైని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం జిల్లాలో నీతి అయోగ్ కింద చేపడుతున్న ప్రాజెక్టులు, మౌలిక వసతుల కల్పన అంశాలపై సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీసీ మాల్ నుంచి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని తిర్యాణి బ్లాక్‌లో నీతి అయోగ్‌లో భాగంగా గిరిజన గ్రామాలలో మౌలిక వసతులు, నైపుణ్యత శిక్షణ, వ్యవసాయ రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీతి అయోగ్ పథకం ద్వారా మంజూరైన నిధులతో ఆరోగ్యం, న్యూట్రిషన్, విద్యారంగంలో వసతుల కల్పన, స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాల మంజూరు, మౌలిక వసతుల కల్పన, గిరిజనులకు వైద్య సేవలు అందించేందుకు పూర్తి సౌకర్యాలతో కూడిన అంబులెన్స్ ఏర్పాటుకు చరలు తీసుకుంటున్నామని చెప్పారు. మినీ అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల భవనాల నిర్మాణాలు, రైతు వేదికలు, పాఠశాలల్లో కంప్యూటర్లు సమకూర్చడం, మౌలిక వసతులు, మ హిళా సమాఖ్య భవనాల నిర్మాణాలతో పాటు ఆకాంక్షిత బ్లాక్ ప్రాంతంలో చేపడుతున్న అభివృద్ధి పనుల వివరాలను తెలియజేశారు. కార్యక్రమంలో ట్రైనింగ్ డిప్యూటీ కలెక్టర్ జాస్టిన్ జోల్, ఉపగణాంకాధికారి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మారుమూల గ్రామాల్లో సెల్‌సిగ్నల్ సేవలను విస్తరిచాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో భారత్ సంచార నిగం లిమిటెడ్, జియో, ఎయిర్‌టెల్ సంస్థల ప్రతినిదులతో సెల్ టవర్ల ఏర్పాటు, సిగ్నల్స్ విస్తరణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారు మూల ప్రాం తాలకు సిగ్నల్స్ అందే విధంగా సేవలను విస్తరించాలన్నారు. చాలా గ్రామాలలో పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదని తెలుపుతూ ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు, చేయూత పెన్షన్లు, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాలకు సిగ్నల్స్‌తో ముడిపడి ఉన్నాయని పూర్తి స్థాయిలో సేవలు అందించేందుకు సిగ్నల్స్ సామర్థ్యాన్ని మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు శశిధర్, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీవో తిరుపతమ్మ

రెబ్బెన, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవాలని ఆసిఫాబాద్ సీడీపీవో తిరుపతమ్మ అన్నారు. రెబ్బెన మండలం గోలేటిలో బుధవారం పౌష్టిక ఆహార మాసాన్ని పురస్కరించుకుని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతో పాటు కిశోర బాలికలు ఐసీడీఎస్ ద్వారా పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచిచారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, సుశీల, స్వర్ణలత, మంజుల, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సీఎంపీఎఫ్ సమస్యలు పరిష్కరిస్తాం



ఫైళ్లు అందిస్తున్న పర్సనల్ విభాగం అధికారులు

శ్రీరాంపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎంపీఎఫ్ సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని రామగుండం రీజినల్ కమిషనర్లు హరి పచౌరి, కె. గోవర్ధన్ అన్నారు. సీఎంపీఎఫ్ సమస్యలు జీరో పెండెన్సీ లక్ష్యంగా మూడో ప్రయాస్-కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్‌లో భాగంగా బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సింగరేణి ఉద్యోగులకు నంబర్ అలాట్‌మెంట్, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల క్లయిమ్స్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్ వారిని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, సీనియర్ పీవో కాంతారావు, అకౌంట్స్ అధికారి పద్మ, సీఎంపీఎఫ్, సింగరేణి కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన రోజే మెడికల్ కార్డు

శ్రీరాంపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సంస్థలో ఉద్యోగ విరమణ పొందిన రోజే మెడికల్ కార్డు అందించేందుకు డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు ఆదేశించారు. శ్రీరాంపూర్ ఏరియాలో తేది: 31-10-2025 రోజున ఆరుగురు ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందుతున్నారు. వారికి సంబంధించి మెడికల్ కార్డు అందించేందుకు అవసరమైన డాక్యుమెంట్లను ఆయా గనుల నుంచి తెప్పించుకొని క్లెయిములు ప్రాసెస్ చేసి కార్పొరేట్ నుంచి మెడికల్ కార్డులు తెప్పించినందుకు శ్రీరాంపూర్ ఏరియా పర్సనల్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగి స్వామిని ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ చేతులమీదుగా ప్రోత్సాహక బహుమతి అందించారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, డీజీఎం (పర్సనల్) అనిల్ కుమార్, టింబర్ యార్డు ఇన్‌చార్జి రాజేశ్వర్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు రాజేష్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సింగరేణి ఆస్తులను కాపాడుకోవాలి



మందమర్రిలో సిబ్బందికి బహుమతి అందజేస్తున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిటౌన్ (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆస్తులను కాపాడుకోవాలని, ఇందులో ఎస్అండ్‌పీసీ సిబ్బంది మరింత బాధ్యతగా వ్యవహరించాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ తెలిపారు. కేకే ఓసీపీ వద్ద దొంగతనానికి ప్రయత్నించిన దొంగలను పట్టుకోవడంతో కీలక పాత్ర పోషించిన ఎస్అండ్‌పీసీ సిబ్బందిని బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రశంసాపత్రంతో పాటు బహుమతులు అందజేశారు. జీఎం మాట్లాడుతూ ఎస్అండ్‌పీసీ సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండ వద్దని, ఎప్పుడు పరిసరాలను పర్యవేక్షిస్తూ సింగరేణి ఆస్తుల రక్షణకు కృషి చేయాలన్నారు. భారీ ఇనుప పనిముట్లు, తదితర వస్తువులను పరిశీలిస్తూ ఉండాలన్నారు. రాత్రివేళల్లో ఎక్కువగా దొంగతనాలు జరిగే అవకాశాలుంటాయని రాత్రి ఉండే సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం విజయ్‌ప్రసాద్, సెక్యూరిటీ ఆఫీసర్ రవి తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట, (ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో బొగ్గు డిమాం డ్‌కు అనుగుణంగా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని మందమర్రి జీఎం రాధాకృష్ణ అన్నారు. మందమర్రి డివిజన్ పరిధిలోని కాసిపేట 2వ గనిని సందర్శించి పనిస్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు, కార్మికులు బొగ్గు ఉత్పత్తికి సమిష్టిగా కృషి చేయాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని చేస్తూ నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈడీ ఎస్ఈ కిరణ్‌కుమార్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి స్థలంలో అక్రమ కట్టడాన్ని తొలగించాలి

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పద్మశాలిభవన్ వెనుకాల ఉన్నటువంటి సింగరేణి స్థలంలో అక్రమంగా నిర్మించిన నిర్మాణాన్ని తొలగించాలని బుధవారం మందమర్రి ఏరియా జీఎం రాధాకిషన్‌కు పట్టణ పరిరక్షణ కమిటీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా సింగరేణి స్వాధీనంలో ఉన్నటువంటి భూమిని కొందరు వ్యక్తులు కబ్జాకు పాల్పడుతున్నారని చెప్పారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిప్ప నర్సయ్య, దాగాం మల్లేశ్, రాజమౌళి, తిలక్, సబ్బని రాజేంద్ర ప్రసాద్, జయరాం యాదవ్, రాయలింగు, అఫ్జల్, పసులేటి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వంద మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న డైరెక్టర్లు

మందమర్రిటౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థను మరింత ప్రగతి పథంలో నడిపించడమే లక్ష్యంగా వంద మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్య సాధనకు సంబంధించి బుధవారం కొత్తగూడెంలోని ఎల్లందు క్లబ్‌లో మేధో మధనం నిర్వహించారు. సింగరేణి పదవీ విరమణ డైరెక్టర్లు, జీఎంలు, ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా టెలికాన్ఫరెన్స్ ద్వారా సింగరేణి సీఎండీ బలరాం మాట్లాడారు. సింగరేణి సంస్థను భారతదేశంలోని అయా రాష్ట్రాలతో పాటు విదేశాల్లో కూడా విస్తరించేందుకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. వంద మిలియన్ టన్నుల లక్ష్యాలను సాధించేందుకు సంస్థలో చేపట్టాల్సిన సంక్షేమ, అభివృద్ధిపై సలహాలు ఇవ్వాలని ఆయన కోరారు. ప్రస్తుతం సింగరేణి సంస్థ ఆయా రంగాల్లో కూడా అడుగు పెట్టిందని తెలిపారు. అనంతరం ఈ సమావేశానికి డైరెక్టర్ పా పొట్రు మాట్లాడుతూ తెలంగాణలో అతి పెద్ద పరిశ్రమ అయిన సింగరేణిలో వంద మిలియన్ టన్నుల లక్ష్యానికి సంబంధించి విలువైన సూచనలు చేయాలని అన్నారు. గతంలో సంస్థలో పనిచేసిన విరమణ పొందిన డైరెక్టర్‌లు, జీఎంలు సంస్థ అభివృద్ధికి, భావి తరాల ఉపాధి కోసం సూచనలు ఇస్తే పాటిస్తామని చెప్పారు. ప్రమాద రహిత ఉత్పత్తికి సంబంధించి పకడ్బందీ రక్షణ చర్యలు చేపడుతు న్నామన్నారు. . సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్ సూర్యనారాయణ, డైరెక్టర్‌పీపీ వెంకటేశ్వర్లు, ఈఅండ్ఎం తిరుమల్‌రావు, అడ్వైజర్ కోల్ మినిస్ట్రీ వీరారెడ్డి, రిటైర్డు సేఫ్టీ జీఎం గురవయ్య, రిటైర్డు డైరెక్టర్లు ప్రసాద్, రమేష్‌కుమార్, మనోహర్ రావు, భాస్కర్‌రావు, బాలకొండరెడ్డి, డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

సంస్థ బకాయిలపై దృష్టి సారించాలి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి

శ్రీరాంపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి సింగరేణి సంస్థకు రావాల్సిన బకాయిలపై యాజమాన్యం దృష్టి సారించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఎస్ఆర్‌పీ 1 గనిపై బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గెలిచిన సంఘాలు లాభాల వాటా ప్రకటన కార్యక్రమానికి హాజరై బయటకు వచ్చి నిరసన తెలియజేశామనడం హాస్యాస్పదమన్నారు. సంస్థకు రావాల్సిన 42 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే వసూలు చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది ఎక్కువ లాభాలు వచ్చాయని చెప్తున్న యాజమాన్యం కార్మికులకు తక్కువ వాటా ఇచ్చారని అన్నారు. ఈ విషయంలో కార్మికులు అసంతృప్తితో ఉన్నారన్నారు. ఉద్యోగాలు ఇచ్చినప్పుడు గొప్పలు చెప్పుకుంటున్న సంఘాలు ఏడు నెలలుగా డిపెండెంట్లకు ఆర్డర్లు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ఎన్నికలు జరిగి రెండేళ్లయినా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, రాష్ట్ర కమిటీ సభ్యుడు కస్తూరి చంద్రశేఖర్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, బ్రాంచ్ నాయకులు వెంకట్‌రెడ్డి, గోపాల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికుల కోసం..

సమగ్రమైన చట్టం చేయాలి

హాజీపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్రమైన చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గోమాస ప్రకాష్ అన్నారు. బుధవారం హాజీపూర్‌లో సీఐటీయూ మండల మహాసభ నిర్వహించారు. ఈ సమావేశానికి కామ్రేడ్ మహేందర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కామ్రేడ్ గోమాస ప్రకాష్ మాట్లాడుతూ అసంఘటిత రంగ కార్మికుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం సమగ్రమైన చట్టం చేయాలన్నారు. అలాగే పీఎఫ్, ఈ.ఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్, ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలను అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నా రు. కన్వీనర్‌గా చిన్నయ్య, సభ్యులుగా ఎస్ మహేందర్, మల్లేష్, నగేష్, సదానందం, బాపు, సుధాకర్, నసీమా, పద్మలను ఎన్నుకున్నారు. కార్మిక సంఘ నాయకులు, సభ్యులు, వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

నెన్నెల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) :పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే 108 అంబులెన్స్‌లోనే సుఖ ప్రసవం జరిగింది. కుమురం భీం జిల్లా చింతలమానెపల్లికి చెందిన పంచపూలకు బుధవారం పురిటి నొప్పులు వచ్చాయి. ఆ ప్రాంతంలోని అంబులెన్స్‌లు అందుబాటులో లేక పోవడంతో నెన్నెల అంబులెన్స్‌ను అక్కడికి పంపించారు. మంచిర్యాల ఎంసీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు మరింత అధికం అయ్యాయి. దీంతో పైలెట్ తిరుపతి అంబులెన్స్‌ను దారి పక్కన నిలిపివేశారు. వాహనంలోనే ఈఎంటీ రాజేశ్వరి సాయంతో వంచపూలకు సుఖ ప్రసవం కాగా, మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రసవం అనంతరం తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నారని అంబెలెన్స్ సిబ్బంది తెలిపారు.

జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

తాండూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : అచ్చులాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో బుధవారం ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి బాల బాలికల కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి 500 మంది పాల్గొన్నట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, ఎంపీడీవో శ్రీనివాస్, జిల్లా డీసీఈబీ సెక్రటరీ మహేశ్వర్‌రెడ్డి, యాకూబ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, మాజీ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ గట్టు మురళీధర్‌రావు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ప్రదీప్, మాజీ గ్రంథాలయ చైర్మన్ మహేందర్‌రావు, క్రీడల అబ్జర్వర్ గోపాల్, పీడీ సుదర్శన్, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పొలంబాట

లక్షెట్టిపేట, అక్టోబరు, 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఉన్నటువంటి విద్యుత్ సమస్యల పరిష్కారానికి పొలంబాట కార్యక్రమం నిర్వహిస్తారని విద్యుత్ శాఖ ఏడీఈ ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని ఊత్కూర్ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీఈ మాట్లాడుతూ రైతులకు ఏలాంటి విద్యుత్ సమస్యలు ఉన్న తక్షణమే సంబంధిత లైన్‌మెన్ దృష్టికి తీసుకుపోవాలన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తు అందించడమే లక్ష్యంగా విద్యుత్ శాఖ పని చేస్తుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఈ గణేష్, ఎఫ్ఎం నర్సింగర్‌రావు, లైన్ ఇన్స్‌పెక్టర్ సత్యనారాయణ, రవికు మార్, లైన్‌మెన్ రాజమౌళితో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రైతులు కూరగాయలు, పండ్లసాగుపై దృష్టి పెట్టాలి

మంచిర్యాల జిల్లా ఉద్యాన శాఖ అధికారి అనిత

లక్షెట్టిపేట, అక్టోబరు, 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటలైన కూరగాయలు, పండ్లు, పూలు లాంటి ప్రత్యేక పంటలపై కూడా దృష్టి పెట్టాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి అనిత అన్నారు. బుధవారం లక్షెట్టిపేట మండలంలోని సూరారం గ్రామంలో సాగు చేస్తున్న ఉద్యాన పంటలైన కూరగాయలు, పూల తోటలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగులో ఖర్చు తక్కువగా ఉంటుందని అధిక లాభాలు పొందే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీలు కూడా ఎక్కువగా ఉంటాయని వాటిపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట ఉద్యాన విస్తరణ అధికారి శేఖర్‌తో పాటు రైతులు రాజు, మల్లేష్ హేహంత్ రెడ్డి ఉన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత



- లోక కల్యాణ మేళాతో రుణాలు
- సద్వినియోగం చేసుకుంటున్న చిరు వ్యాపారస్తులు

బెల్లంపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పీఎం సన్నిధి ద్వారా వీధి విక్రయదారులకు బ్యాంక్ రుణాలు అందించి వ్యాపార అభివృద్ధికి తోడ్పాటును అందిస్తుంది. లోక కల్యాణ పథకంలో భాగంగా చిరు వ్యాపారస్తులకు రుణాలు అందిస్తూ ఆర్థికంగా ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని మున్సిపాలిటీల్లో మెప్మా అధికారులు వీధి విక్రయదారులను గుర్తించి రుణాలు అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో లోక కల్యాణమేళా శిబిరాలను నిర్వహిస్తూ వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తూ అధిక రుణాలను అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారు.

మున్సిపాలిటీల్లో రుణాల అందజేత...

జిల్లాలోని మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతన్‌పల్లి, నస్పూర్, లక్షెట్టిపేట, మందమర్రి మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ మున్సిపాలిటీల్లో సెప్టెంబరు 17 నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లోక కల్యాణ మేళా పథకంలో బాగంగా వీధి విక్రయదారులకు, చిరు వ్యాపారులకు రుణాలను అందించేందుకు సంబందిత మెప్మా అధికారులు శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కరోన సమయంలో చిరు వ్యాపారులకు చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్బర్ భారత్ పథకంలో భాగంగా బ్యాంకుల్లో రుణాలు ఇచ్చి ఆదుకుంది. రూ. పదివేల నుంచి ప్రారంభించి ప్రస్తుతం వ్యక్తిగతంగా రూ. 20వేల నుంచి రూ. 50వేల వరకు రుణాలు తీసుకొని తమ వ్యాపారాలను అభివృద్ధి చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే అవకాశాలను కల్పించింది. ప్రస్తుతం లోక కల్యాణమేళా పథకంతో మున్సిపాలిటీ ల్లోని వీధి విక్రయ దారులకు రుణాలు అందించనుంది.

మున్సిపాలిటీల్లో ఇప్పటి వరకు బ్యాంక్ రుణం తీసుకోని వీధి విక్రయదారులను గుర్తించి వారికి లోకకల్యాణ మేళాలో భాగంగా వ్యక్తి గత రుణాలు ఇప్పించేందుకు మెప్మా సిబ్బంది కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా పట్టణ మహిళా సమాఖ్య ఆర్పీలు కలిసి రోజు చిరు వ్యాపారుల వివరాలు సేకరించి గ్రూపుగా ఏర్పాటు కావాలంటూ సలహాలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు వీధి విక్రయదారులకు వ్యక్తిగతంగా బ్యాంకు రుణాలు ఇచ్చిన అధికారులు ప్రస్తుతం మహిళా సంఘాల మాదిరిగా వీధి విక్రయదారుల సంఘాలకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతంలో వ్యక్తి గతంగా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు తిరిగి చెల్లించిన వారికి రూ.50వేల వరకు రుణం ఇచ్చారు. ఇలా వ్యక్తంగా కాకుండా గ్రూపునకు రూ. 5 లక్షల నుంచి 10 లక్షల వరకు రుణం మంజూరు చేసే వీలుందని అధికారులు వెల్లడించారు. ఇందుకు జిల్లాలోని మెప్మా, ఆర్పీలు తమ క్లస్టర్ పరిధిలో రుణం పొంది సకాలంలో తిరిగి చెల్లిస్తున్న జాబితాను సిద్ధం చేసి పాత, కొత్త వారిని కలిపి సంఘాల ఏర్పాటుకు సన్నద్ధమవుతున్నారు.

చిరువ్యాపారుల గుర్తింపు...

జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో లోక కల్యాణ మేళాలో భాగంగా చిరు వ్యాపారులను అదికారులు గుర్తించారు. ఇందులో భాగంగా మొదటి విడతలో జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో మొత్తం 17,512 మంది అర్హత గల చిరు వ్యాపారులు దరఖాస్తు చేసుకోగా ఇందులో 16955 మంది చిరు వ్యాపారులకు 16 కోట్ల78 లక్షల రుణాలను మంజూరు చేశారు. అలా గే రెండో విడతలో భాగంగా జిల్లా వ్యాప్తంగా మున్సిపాలిటీలో 12036 మంది చిరు వ్యాపారస్తులు దరఖాస్తుచేసుకోగా 9827 మందికి రూ. 19కోట్ల 38లక్షల రుణాలను మంజూరు చేశారు. మూడో విడతలో భాగంగా 6119 మంది చిరు వ్యాపారస్తులు దరఖాస్తులు చేసుకోగా 2216 మందికి 10కోట్ల61లక్షల రుణాలను మంజూరు చేశారు. రుణాలు అందుకున్నవారు ప్రతి నెల బ్యాంకుల్లో తమ రుణాన్ని బట్టి రూ. 100 నుంచి ఆపై పొదుపు జమ చేయాల్సి ఉంటుంది.





లక్షెట్టిపేటలో వీధి వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, బెల్లంపల్లిలో అర్హత పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

దండారి దర్బార్ ఉత్సవాలు ప్రారంభం

కాసిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సల్పాల వాగు వెంకటాద్రి ఆలయం ఆవరణలో రెండు రోజుల పాటు నిర్వహించే దండారి ఉత్సవాలను బుధవారం ఆదివాసీ పూజారులు ఘనంగా ప్రారంభించారు. సంస్కృతి సంప్రదాయాల మధ్య భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అలాగే గుస్సాడీలు బుధవారం రాత్రి వెంకటాద్రి ఆలయానికి చేరుకుంటారని నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు భక్తులు చేరుకుని వెంకటాద్రి ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. గురువారం దండారీ దర్బార్ ఉంటుందని, ఆదివాసీ గూడాల నుంచి గిరిజనులు తరలి రావాలని కోరారు.

నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

టెక్నికల్ అఫీషియల్‌గా సంతోష్ యాదవ్

బెల్లంపల్లి,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో పీఈటీ విధులు నిర్వహిస్తున్న సల్పాల సంతోష్ యాదవ్‌ను నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టెక్నికల్ అఫీషియల్‌గా నియమితులైనట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి సారంగపాణి తెలిపారు. హన్మకొండలో జవహర్‌లాల్ నేహ్రూ స్టేడియంలో అక్టోబర్ 16 నుంచి 18 వరకు జరుగనున్న 5వ ఇండియన్ ఓపెన్ అండర్-23 నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టెక్నికల్ అఫిసియల్‌గా విధులు నిర్వహించనున్నారు.

బంగారం,వెండి అమ్మకాల్లో చేతివాటం..?

(7వ పేజీ తరువాయి)

పోలిన అచ్చులను అక్రమంగా తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో పట్టణంలోని గోపాల్‌వాడకు చెందిన సత్యాన్ సంపత్ పడతరే, అశోక్ రోడ్డుకు చెందిన పడతరేసాగర్‌లు అక్రమంగా అచ్చులు వేస్తుండగా పోలీసులు దాడులు చేయడంతో అవినీతి దందా వెలుగు చూసింది. పోలీసులు అచ్చులతోపాటు నిందితులను అదుపులోకి తీసుకోవడంతో జిల్లాలో కలకలం రేపింది.

అక్రమంగా ధ్రువీకరణ పత్రాలు జారీ..

ఇదిలా ఉండగా జిల్లాలోని కొందరు బంగారు, వెండి వ్యాపారులు మరో కొత్త ఒరవడికి తెరలేపినట్లు ప్రచారం జరుగుతోంది. ఆభరణాల తయారీకి ఆర్డరు ఇస్తే హాల్‌మార్క్‌తో కూడిన సర్టిఫికెట్లు ఇస్తామంటూ నమ్మ బలుకుతున్నారు. దీంతో నమ్మి వచ్చే వారికి స్థానికంగానే నగలు తయారు చేయిస్తూ, హైద్రాబాద్‌లో చేయించామంటూ మోసగిస్తున్నట్లు సమాచారం. ఇక్కడ తయారైన నగలకే హైద్రాబాద్‌లోని ప్రభుత్వ అనుమతి పొందిన కొన్ని షాపులకు చెందిన హాల్‌మార్క్ సర్టిఫికె ట్లు తెప్పించి ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. హై ద్రాబాద్‌లో నగలు తయారు చేసే వారిని మశ్చిక చేసు కుంటున్న ఇక్కడి వ్యాపారులు వారికి కొంత ముట్టజెప్పి అక్రమ మార్గంలో హాల్‌మార్క్ సర్టిఫికెట్లు తెప్పిస్తున్నట్లు సమాచారం. హాల్‌మార్క్ సర్టిఫికెట్లు కలిగిన నగలను దేశంలో ఎక్కడైనా విక్రయించే అవకాశం ఉంటుంది. అయితే అక్రమ మార్గంలో సర్టిఫికెట్లు తెప్పి స్తుండటంతో ఇక్కడ కొనుగోలు చేసిన నగలను ఇతర ప్రాంతాల్లో విక్రయించేందుకు అవకాశం లేక ప్రజలు నిలువునా నష్టపోతున్నారు. ఈ దందాపై పోలీసులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

చెన్నూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ 8వ పోషన్ మాసం సందర్భంగా బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మనోరమ, ఎంపీడీవో మోహన్‌లు పోషకాహారంపై అవగాహన, రక్తహీనత నివారణపై తగు సూచనలు చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు. ఏపీఎం వెంకటేష్, ఏసీడీపీవో శ్రావణి, సూపర్‌వైజర్‌లు కవిత, మాధవి, సువర్ణ, పద్మ, పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల సంఖ్య పెంచాలని కోరుతూ ఈ నెల 18న తలపెట్టిన తెలంగాణ బందు ను విజయ వంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేసారు. బుధవారం పట్టణంలోని ఐబీలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రోజు రోజుకూ బీసీలకు అన్యాయం జరుగుతుందని కనీసం 5శాతం లేని రెడ్డి, జాగృతికి చెందిన నేతలు 60శా తం ఉన్న బీసీలను రాజకీయంగా ఎదగ కుండా అణిచివేస్తున్నారన్నారు. బీసీల రిజ ర్వేషన్ పెంపునకు ఈనెల 18న తలపెట్టి న బందును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ సంఘాల నాయకులు కళ్యాణం రవి, అంకతి కిషన్ పాల్గొన్నారు.

కోటపల్లి : మండల కేంద్రంలోని బియ్యం గోదామును బుధవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చౌకధరల దుకాణాలకు సరఫరా అయ్యే బియ్యం నిల్వలను పరిశీలించిన ఆయన గోదాములో ఉన్న స్టాకు రిజిష్టర్ ప్రకారం బియ్యం నిల్వలు ఉన్నాయా లేదా అనే విషయాన్ని పరిశీలన జరిపారు. బియ్యం నిల్వలను బస్తాల వారీగా పరిశీలించిన ఆయన బియ్యం నాణ్యతను తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాఘవేంద్రరావు, గిర్దావర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటుతున్నారని ప్రిన్సిపల్ సారా తస్నీం పేర్కొన్నారు. బుధవారం ఆమె మాట్లాడు తూ అండర్ 19 ఫుట్ బాల్ పోటీల్లో విద్యార్థి మణిదీప్ పాల్గొని ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడన్నారు. కబడ్డీ పోటీల్లో విద్యార్థిని శశిరేఖ రాష్ట్ర పోటీలకు ఎంపికైందన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి మండలంలోని నేషనల్ హైవే 63 నిర్మాణంలో భూములు కోల్పోయిన వారి అభ్యర్థన మేరకు మళ్లీ తిరిగి సర్వే నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఆయన మాట్లాడుతూ గతంలో భూములు కోల్పోయిన వారు సమయానికి రెవెన్యూ అధికారులకు అందుబాటులో లేకపోవడం, అధికారులను కలువకపోవడంతో వారు నష్టపోయారని తెలిపారు. మళ్లీ సర్వే నిర్వ హిస్తున్నామన్నారు.

మంచిర్యాల కలెక్టరేట్ : ఈ నెల 18న తెలంగాణ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్‌లకు హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ బంద్‌కు పిలుపునిచ్చామన్నారు.

ధాన్యం సేకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : 2025-26 ఖరీఫ్ సీజన్ వరిధాన్యం సేకరణ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం హైద్రాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. వానాకాలంలో 66లక్ష ల80 వేల ఎకరాల్లో ప్రతిపాదిత వరి సాగు జరిగిందని, దాదాపు 148 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వచ్చే అవకాశం ఉందని, 80 లక్షల మెట్రిక్ టన్నుల అంచనా ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. వరిధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ. 2389, సాధారణ రకానికి రూ. 2369 మద్దతు ధర నిర్ణయించామన్నారు. సన్నరకం వడ్లకు బోనస్‌రూ. 500 ఇస్తామన్నారు.

ఈ విషయాలను రైతులకు తెలియజేయాలన్నారు. గన్నీ సంచులను, ప్యాడీ క్లీనర్లను, తూకం యంత్రాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లాపౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా వ్యవసాయాదికారి సురేఖ, జిల్లా మేనజర్ శ్రీక ళ తదితరులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు

ఫారెస్టు మేనేజర్‌ను బదిలీ చేయాలి

హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో ధర్నా

జైపూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీ నర్సరీల్లో పనిచేస్తున్న ఫారెస్టు మహిళా కాంట్రాక్టు కార్మికులు తీవ్ర వేధింపులకు గురవుతు న్నారని పేర్కొంటూ బుధవారం హెచ్‌ఎంఎస్ నాయకులు, నర్సరీ మహిళ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంఎస్ అధ్యక్షుడు తిప్పారపు సారయ్య మాట్లాడుతూ ఫారెస్టు మేనేజర్ చంద్రమణి మహిళ కార్మికులను అసభ్య పద జాలంతో దూషించడం, అనవసరంగా మానసిక ఒత్తిడికి గురి చేయడం, వర్షాలు పడితే పని బంద్ చేసి జీతాలు ఇవ్వక పోవడం, పనికి వచ్చినా మస్టరు ఇవ్వకపోవడం వంటి చర్యలతో కార్మికులు తీవ్ర మనస్థాపానికి గురవుతున్నారన్నారు. ప్రతి రోజు 200 నుంచి 300 మీటర్లు పనిచేయాలని భారం మోపుతూ పనిచేయలేని కార్మికులకు వార్నింగ్ లెటర్లు జారీ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. తక్షణమే చంద్రమణిని వేరే డివిజన్‌కు బదిలీ చేయాలన్నారు. విషయం తెలుసు కుని జీఎం నర్సింహారావు, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబులు సంఘటన స్థలానికి వచ్చారు. కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. అనంతరం జీఎంకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ హెచ్‌ఎంఎస్ జనరల్ సెక్రటరీ విక్రమ్‌కుమార్, ఉపాధ్యక్షుడు సాయికృష్ణ, చిప్పకుర్తి సంపత్, నవీన్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నర్సరీ కాంట్రాక్టు కార్మికులు, హెచ్‌ఎంఎస్ నాయకులు

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



అధికారులకు సూచనలిస్తున్న సబ్ కలెక్టర్ మనోజ్

నెన్నెల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్ కార్యాలయాన్ని బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. భూముల రిజిస్ట్రేషన్ల తీరు గూర్చి తహసీల్దార్ శ్రీనివాస్‌ను అడిగి తెలసుకున్నారు. నెన్నెల శివారు 671, 672 సర్వేనం బర్లలో అటవి, రెవెన్యూ శాఖల వివాదం గూర్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా అధికారులకు సలహాలు, సూచనలిచ్చారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. నాయబ్ తహసీల్దార్ ప్రకాష్, గిర్దావర్లు సులోచన, దుర్గం వెంకటేష్, సర్వేయర్ దశరథం ఉన్నారు.

జాతీయ స్థాయి యోగా అవార్డు

జన్నారం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మహ్మదాబాద్ గ్రామానికి చెందిన దుర్గం వినోద్‌కుమార్‌కు నేషనల్ యోగా స్పోర్ట్స్‌లో చాంపియన్‌షిప్‌లో రెఫరీగా అవార్డు లభించింది. ఆయన తెలిపిన వివరాల మేరకు గణపతి సచ్చితానంద ఆశ్రమం మైసూర్ వేదిక అక్టోబరు 9 నుంచి 12 వరకు జరిగిన జుబ్లీ సీనియర్ నేషనల్ యోగా చాంపియన్ షిప్‌లో తెలంగాణ నుంచి నేషనల్ యోగా రెఫరీగా సేవలు అందించినందుకు గాను అవార్డు అందుకున్నట్లు తెలిపారు. యోగా ఫెడేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ అభినవ్ జోషి, వైస్ ప్రెసిడెంట్ మనోహర్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు.

చెక్‌బౌన్స్ కేసులో ఏడాది జైలు శిక్ష

బెల్లంపల్లి, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): చెక్‌బౌన్స్ కేసులో ఒకరికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముకేశ్ బుధవారం తీర్పు చెప్పారు. పట్టణానికి చెందిన రత్నం రాజంకు 2019లో బోగి మోహన్ అనే వ్యక్తి రూ.3లక్షల50వేల చెక్కును ఇచ్చాడు. సదరు చెక్కు బ్యాంకులో బౌన్స్ కావడంతో బాధితుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కోర్టులో రుజువు కావడంతో మోహన్‌కు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ముకేశ్ బుధవారం ఏడాది జైలు శిక్షతో పాటు రూ.5లక్షల జరిమాన విధించినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస రావు తెలిపారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి

భీమిని, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీవో గంగామోహన్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఉపాధి హామీపథకంలో భాగం గా గ్రామసభల ద్వారా నూతన పనులను గుర్తించాలన్నారు. నర్సరీలను శుభ్రం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సత్య ప్రసాద్, ఈసీ రాజేంద్రప్రసాద్, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఫైలేరియా సర్వే

జన్నారం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రోటిగూడ, గీతానగర్‌లో జరుగుతున్న బోధకాలు వ్యాధి సర్వేను రాష్ట్ర పరిశీకులు డాక్టర్ లక్ష్మణ్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బోధకాలు సర్వేలో అందరు పాల్గొనాలన్నారు. శ్రీనివాస్, మంచిర్యాల ల్యాబ్‌టెక్నిషియన్లు సంతోష్, కమలాకర్, సత్యం పాల్గొన్నారు.

పశు సంపదతోనే రైతులకు ఆర్థిక అభివృద్ధి

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. శంకర్

దండేపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధంగా పశువులను పెంచుకునే పశు సంపదను అభివృద్ధి చేసుకుంటే ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చునని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. శంకర్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో దండేపల్లి మండలం ముత్యంపేటలో బుధవారం మెగా గాలికుంటు వ్యాధి నివార ణ పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గాలి కుంటు వ్యాధి వలన పశువులకు తీవ్రమైన జ్వరం పాడి పశువులలో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గడం, పునరుత్పత్తి సామర్థ్యం తగ్గడంతో రైతులకు నష్టం కలుగుతుందన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఉచిత పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూగజీవలకు గాలికుంటు నివారణ టీకాలను వేయించాలని పశుపోషకులకు సూచించారు. అనంతరం 280 పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌టీఏ మెంబర్ అంకతి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్లు రాజన్న, రాకేష్, అసిస్టెంట్ జాయింట్ డైరెక్టర్ యాకుబ్‌రెడ్డి, పశువైద్యాధికారులు డా. ధనరాజ్, భూమన్న, సుజాత ఉన్నారు.

ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

కాసిపేట : ఈ నెల 15 నుంచి వచ్చే 14 వరకు మండలంలోని పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేస్తున్నామని మండల పశువైద్యా ధికారిణి సరిత అన్నారు. బుధవారం ముత్యంపల్లిలో ఉచిత గాలికుంటూ వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పశువలు ఈ సీజన్‌లో గాలికుంటు వ్యాధి బారిన పడతాయని, కాలి గిట్టలు మెత్తబడి పుండ్లుగా మారుతాయని, దీంతో నడవడం కష్టగా మారుతుం దన్నారు. దీంతో ఆవులు, గేదెల్లో పాల దిగుబడి తగ్గుతుందన్నారు. రైతులందరు పశువులకు ఈ టీకాలను వేయించాలన్నారు. 380 పశువులకు టీకాలను వేసినట్లు తెలిపారు. ఈ కార్యక మంలో పశువైద్య సిబ్బంది సంతోష్, శ్యామ్, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

భీమిని : మండలంలోని అక్కలపల్లి గ్రామంలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేసినట్లు పశువైద్యుడు కిరణ్‌కుమార్ తెలి పా రు. 150 పశువులకు టీకాలను వేశామన్నారు. ఈ కార్యక్రమం నవంబర్ 14 వరకు కొనసాగుతుందని, రైతులందరు తమ పశువులకు టీకాలను వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రతిరుపతి, రైతులు పాల్గొన్నారు.

జైపూర్ : పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలే మార్గమని మండల పశువైద్యాధికారి వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో 156 పశువులకుగాలికుంటు నివారణ టీకాలను వేసినట్లు తెలిపారు. పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే రైతులందరు టీకాలను వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శృతిలయ, శ్రావణ్ పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి శంకర్, నాయకులు

- ఈజీఎస్ కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి
- ఆధార్, జాబ్‌కార్డు వివరాలు యాప్‌లో నమోదు
- జిల్లాలో కొనసాగుతున్న ప్రక్రియ

'ఉపాధి'లో అక్రమాలకు చెక్



ఆసిఫాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఉపాధి కూలీల ఈకేవైసీ నమోదు ప్రక్రియ జిల్లాలో వేగంగా కొనసాగుతోంది. కూలీల ఆధార్ కార్డులను జాబ్ కార్డులతో ఈకేవైసీ చేసుకుంటేనే ఉపాధి పనులు కల్పించాల ని ప్రభుత్వం నిర్ణయించింది. దీని కోసం ఎన్ఆర్ ఈజీఎస్ మొబైల్ మానిటరింగ్ సిస్టం యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఉపాధి కూలీల ఆధార్ కార్డు, జాబ్ కార్డు వివరాలను నమోదు చేసి ముఖ గుర్తింపు ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కూలీలు తమ ఆధార్ కార్డులతో ఉపాధిహామీ సిబ్బందిని కలిస్తే ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తి చేస్తారు. ఇందుకోసం కూలీలు, ఆధార్ కార్డును తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఈకేవైసీ పూర్తి చేయని కూలీలు ఇక నుంచి ఉపాధి పనుల్లో అవకాశం కోల్పోతారు.

1.65 లక్షల మంది కూలీలు..

జిల్లాలో ఉపాధిహామీ కూలీలు మొత్తం 1,65,541 మంది ఉన్నారు. కూలీల హాజరు నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు నకిలీ ఫొటోలను అప్‌లోడ్ చేస్తూ నిధులు స్వాహా చేస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. పనులకు వెళ్లకున్నా హాజరైనట్లు, ఒకరి పేరు మీద మరొకరు వెళ్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మరోవైపు సామాజిక తనిఖీల్లో అక్రమాలు బయట పడడం, రికవరీలు జరుగు తున్నా ఏమాత్రం మార్పు కనిపించడం లేదు. ఈ క్రమంలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్రం ఎన్ఎంఎంఎస్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీన్ని సైతం దుర్వినియోగం చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో కూలీలకు కూలి గిట్టుబాటు కాక ఆశించిన స్థాయిలో వేత నాలు రావడం లేదు. దీంతో వీటన్నింటికీ చెక్ పెట్టేలా కేంద్ర ప్రభుత్వం ఈకేవైసీని తప్పనిసరి చేసింది.

జిల్లాలోని మండలాలు	15
గ్రామ పంచాయితీలు	335
మొత్తం కూలీల సంఖ్య	1,65,541
ఈకేవైసీ పూర్తి చేసిన కూలీల సంఖ్య	1,10,057
ఇంకా చేయాల్సినవి	55,484

హాజరు నమోదు ఇలా..

యాక్టివ్ కూలీల వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేసి పనికి రాగానే, పని పూర్తయ్యాక రెండు సార్లు ముఖ గుర్తింపు ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. ఫొటోలు పని ప్రదేశంలోనే తీయాలి. కూలీ వివరాలు యాప్‌లో నమోదు కాకపోతే ఉపాధి పనికి వెళ్లినా హాజరు పడదు. దీంతో కూలీ డబ్బులు ఖాతాల్లో జమ కావు. వేరే ప్రాంతంలో ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే జీపీఎస్ సిస్టం ద్వారా అది తప్పుడు హాజరని నిర్ధారిస్తుంది. ఈ పద్ధతి ద్వారా ఉపాధిహామీ పథకంలో అవకతవకలను నియంత్రించే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

పకడ్బందీగా ఈకేవైసీ నమోదు

- దత్తారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



జిల్లాలో ఈకేవైసీ నమోదు ప్రక్రియ పకడ్బం దీగా చేపడుతున్నాం. ప్రస్తుతం అన్ని మండలా ల్లోనూ ముమ్మరంగా కొనసాగుతోంది. జిల్లాలో మొ త్తం 1,65,541 మంది కూలీలు ఉన్నారు. ఇప్పటి వరకు 1,10,057 మంది కూలీల ఈకేవైసీ పూర్తి చేశాం. మిగితా వారివి త్వరలోనే పూర్తి చేస్తాం.

యువత క్రీడల్లో రాణించాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

దహెగాం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఖర్జీ గ్రామంలో బుధవారం నిర్వహించిన క్రికెట్ ముగింపు పోటీల్లో పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఫైనల్‌లో దహెగాం, కన్నెపల్లి జట్లు పోటీపడ్డాయి. దహెగాం జట్టు విజయం సాధించిం ది. గెలుపొందిన జట్టుకు రూ.50 వేల నగదుతో పాటు షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరామరావు, భీమన్న, శ్రీనివాస్, మోహన్, మధుకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సమతా సైనిక్ దళ్ శిక్షణకు హాజరవ్వాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అశోక్ మౌల్కర్

వాంకిడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా దమ్మచక్ర పరివర్తన్ దివస్‌ను పురస్కరించుకుని గురువారం నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి సమతా సైనిక్ దళ్ శిక్షణ శిబిరంలో జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మౌల్కర్, సమతాసైనిక్ దళ్ జిల్లా అధ్యక్షుడు దుర్గం సందీప్ కోరారు. మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సమావేశంలో దుర్గాజీ, విజయ్, రోషన్, శ్యాంరావు, దీపక్, ప్రశాంత్, రమేష్, విఠల్, నాగసేన్, నూతన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 167 దరఖాస్తులు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మద్యం దుకాణాలకు బుధవారం నాటికి 167 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ అధికారి జ్యోతికిరణ్ అన్నారు. స్థానికంగా ఆయన మాట్లాడుతూ ఆసిఫాబాద్ డివిజ్‌లో 120, కాగజ్‌నగర్ డివిజన్‌లో 47 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. మరో మూడు రోజుల సమయం ఉన్నదని, వ్యాపారుల నుంచి పోటీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సహకార బ్యాంకు ద్వారా అందించే రుణాలను రైతులు, వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలని సహకార బ్యాంకు ఉమ్మడి జిల్లా సీఈఓ సూర్యప్రకాష్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సహకార బ్యాంకులో జిల్లాలోని సహకార బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని రుణాలు అందించారు, ఎంత రికవరి చేశారు అని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న రుణాలను త్వరగా రికవరీ చేయాలన్నారు. ఆయన వెంట అన్ని సహకార బ్యాంకు మేనేజర్లు, ఫీల్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై వెంకటకృష్ణ

రెబ్బెన, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు చేసినా, వినియోగించినా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్సై వెంకటకృష్ణ అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. దానిలో భాగంగా గ్రామాల్లో గంజాయిని సమూలంగా రూపు మాపేం దుకు పోలీసు శాఖ గట్టిగా నిఘా పెట్టిందన్నారు. గుట్టుగా పంట చేలలో గంజాయి మొక్కలు సాగు చేస్తే చూస్తూ ఊర్కోబోమని, సాగు చేసి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఆర్థిక సహాయం అందజేత

కాగజ్‌నగర్ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలంలోని చిన్న మాలిని గ్రామానికి చెందిన కొర్రం శ్రీదేవి కుటుంబ సభ్యుల ఖాతాలో రూ. 2,500 జమ చేసినట్లు బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. గత ఎన్నికల సమయంలో మాలినికి చెందిన శ్రీదేవి అనే గర్భిణి వైద్యం కోసం మాలిని నుంచి ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. రోడ్డు సౌకర్యం సరిగ్గా లేకపోవడంతో ఆసుపత్రికి సకాలంలో చేరుకోలేదు. మార్గమధ్యలోనే ఆమె కుమారునికి జన్మనిచ్చి మృతి చెందింది. దీంతో అప్పుడు కుటుంబ సభ్యులను కలిసిన బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రతీ నెల కుమారుడి చదువు కోసం రూ. 2,500 ఇచ్చేందుకు హామీ ఇచ్చారు. ఈ మొత్తాన్ని బుధవారం బీఆర్ఎస్ నాయకులు మాలిని వెళ్లి కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలో వేసి బ్యాంకు పాస్‌బుక్కును అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వాసు, తన్నీరు పోచం పాల్గొన్నారు.

వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని తెలంగాణ ట్రైబర్ వెల్ఫేర్ బాలికల పాఠశాలలో బుధవారం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 బాలికల వాలీబాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహించినట్లు కార్యదర్శి వెంకటేష్, క్రీడాధికారి షేక్ తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 48 మంది హాజరయ్యారు. ప్రతిభ చాటిన 12 మందిని ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశామని, వీరు ఈ నెల 18 నుంచి 20 తేదీ వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు, పీఈటీలు భవిత, లక్ష్మణ్, శ్రీనివాస్, సుభాష్, రామ్మోహన్‌రావు, బ్రహ్మం, శ్రీనివాస్, రాకేష్, లక్ష్మి, నాగమణి, రవి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విధులకు హాజరు కావాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సంక్షేమం, భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు విధులకు హాజరు కావాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. స్థానికంగా బుధవారం ఆమె మాట్లాడుతూ వసతి గృహాల్లో పార్టుటైం, దినసరి వేతనంతో పని చేస్తున్న 220 మంది సమ్మెలో పాల్గొన్న నేపథ్యంలో వారి మూడు నెలల వేతనాలు ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. తెలిపారు. దసరా సెలవుల అనంతరం ఈ నెల 4వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం అయినందున సిబ్బంది విధులకు హాజరు కాక పోవడంతో తాత్కాలికంగా బయట వ్యక్తులు పని చేస్తున్నారని తెలిపారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలి



కౌటాలలో పశువులకు టీకా వేస్తున్న సిబ్బంది



పశువులకు టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేయించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆసిఫాబాద్ మండలం అంకుశాపూర్ గ్రామంలో బుధవారం పశువైద్య ఉప కేంద్రంలో పశువైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యజమానులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా తప్పనిసరిగా వేయించాలని సూచించారు. పాడి రైతుల సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కార్యక్రమం నిర్వహిస్తున్నాయని చెప్పా రు. ఈ సంవత్సరం అధిక వర్షాలు కురిసినందున పశువులు వ్యాధుల బారిన పడుతున్నాయని అన్నారు. ఈ సందర్భంగా యజమానులకు పశువులకు బలాన్ని అందించే మల్టీ మిక్స్ పౌడర్ ప్యాకెట్లను అందజేశారు. అనం తరం జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంకు సంబంధించి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ సురేష్‌కుమార్, పశువైద్యాధికారి మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): కౌటాల మండలం తలోడి గ్రామంలో బుధవారం పశువైద్యాధికారి డాక్టర్ కె అంజలి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. ఈ సందర్భంగా నాలుగు నెలల పైబడిన పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సందీప్, ఖదీర్, భిక్షపతి, ప్రకాష్, శోభన్, తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): పెంచికలపేటలో బుధవారం పశువైద్యాధికారి రాకేష్ ఆధ్వర్యంలో పశువులకు గాలింపు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం నిర్వహించారు. మూడు నుంచి 4 నెలల వయస్సు పైబడిన 142 పశువులకు, 99 గేదెలకు గాలి కుంటు నివారణ టీకాలు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు శంకర్, బాబు, అశోక్, తోగయ్య, డాక్టర్ రాకేష్, శివకుమార్, శేఖర్ పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి రమేశ్ తెలిపారు. 280 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది నరేష్, హనుమయ్య, సురేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువైద్యాధికారి డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా వేశారు. రైతులు పశువులకు తప్పని సరిగా టీకా వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలో పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా పశువులకు టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, పౌర సరఫరాలు, వ్యవసాయ, రవాణా, ఎఫ్‌సీఐ శాఖ కమిషనర్లతో కలిసి బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, రవాణా, పోలీసు శాఖల అధికారులతో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఖరీఫ్ 2025-26 సీజన్ వరి ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,342 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల వీసీ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అదనపు కలెక్టర్ డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఆర్డీవో లోకేశ్వర్‌రావు, పౌరసరఫరాలు, వ్యవ సాయ, మార్కెటింగ్, రవాణా శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ జిల్లాలో వానాకాలం సీజన్‌లో 44 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. జిల్లాలో 40 కొనుగోలు కేంద్రాలు ఐకేపీ ఆధ్వర్యంలో 22, పీఏసీఎస్ ద్వారా 18 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 24 నుంచి అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దాదాపు 30 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకానికి క్వింటాలుకు రూ.2,369 ధర నిర్ణయించారని అన్నారు. సన్న రకంకు రూ.500 బోనస్ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి అశ్వక్ అహ్మద్, వ్యవసాయాధికారి వెంకటి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, పౌరసరఫరాల శాఖాధికారి స్వామి, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల సమస్యల పరిష్కారమే ధ్యేయం

బెజ్జూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సమస్యల పరిష్కారమే ధ్యేయమని సంఘం నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ఆదివాసీ భవనంలో బుధవారం గోండ్వానా ఆదివాసీ కోయ సంక్షేమ సంఘం జిల్లా స్థాయి సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల నుంచి వచ్చిన సంఘం ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు. సమావేశంలో జిల్లాలో, రాష్ట్రంలో ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడంతో పాటు పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో నాయకులు తిరుపతి, చిన్నన్న, మధుకర్, మాంతయ్య, ఓంప్రకాష్, సకారాం, అశోక్, అమృత, సాయినాథ్, బక్కయ్య పాల్గొన్నారు.

దండారి సంబరాలు ప్రారంభం



కెరమెరిలో పూజలు నిర్వహిస్తున్న ఆదివాసీలు

కెరమెరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని గోండు గుడాల్లో దండారి సంబరాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. గోండు గూడాల్లో దండారి ఉత్సవాలు ఏటా దీపావళి పండగ పర్వదినానికి వారం రోజుల ముందు నుంచి ప్రారంభమవుతాయి. ఆయా గ్రామాల్లో ఉత్సవ కమిటీలకు గ్రామ పటేల్ కటోడాలు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. మండలంలోని గోండుగూడాలై రాంజీగూడ, అంబరావుగూడ, నిషాని, చౌపన్‌గూడతో పాటు పలు గూడాలలో దండారి సందడి నెలకొంది. గుస్సాడి నెమలి పించాలకు పూజలు చేయడం, అలాగే సంగీత వాయిద్యాలకు సైతం ప్రత్యేక పూజలు చేసి ఆయా గ్రామ పటేళ్లు ఉత్సవాలను ప్రారంభించడం ఆనవాయితీ. ఈ మేరకు ఆయా గ్రామాల్లో పూజలు నిర్వహిస్తారు. కార్యక్ర మంలో గ్రామ పటేళ్లు గంగు, దేవ్‌షా, జలపతిరావ్, భీంరావ్, నర్సింగ్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి



నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

వాంకిడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, బహుజన నేత దాదా సాహెబ్ గైక్వాడ్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో గురువారం అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దుర్గాజీ, విజయ్, శ్యాంరావు, దీపక్, ప్రశాంత్, రమేష్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు యశ్వంతరావు, సిరాజ్ ఉల్ హక్, వెంకన్న, కర్ణాగౌడ్, కృష్ణాజీ, సూరు, గౌరక్క, సత్తమ్మ, కుమారస్వామి, పద్మ, రాజేశ్వర్, మధుకర్, వెంకటయ్య, శంకర్, కనకయ్య, అమలామేరి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం..

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఆయూష్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు యోగా శిబిరం నిర్వహిస్తున్నట్లు అయూష్ యోగా శిక్షకుడు దొడ్డాజీ తెలిపారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో బుధవారం నిర్వహించిన మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభలో ఆసిఫాబాద్ మున్సిపాలిటీ నుంచి పెరిక శ్రీకాంత్, సీహెచ్ శంకర్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు క్రమశిక్షణతో చదవాలని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుకన్య అన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు బెడ్‌షీట్, ప్లేట్లు, గ్లాసులతో కూడిన కిట్‌లను బుధవారం అందజేశారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ కోర్టు ఆవరణలో బుధవారం జిల్లా సెషన్ జడ్జి ఎంవీ రమేశ్ ఆధ్వర్యంలో అండర్ ట్రయల్ ఖైదీల బాగోగులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, డీఎస్పీ వాహిదుద్దీన్, సబ్ జైలు సూపరింటెండెంట్ ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండలం కుశ్నపల్లి- సోమిని గ్రామాల మధ్య మరమ్మతు పనులతో రోడ్డు పూర్తి కావడంతో గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు రోడ్డు గుంతలమయంగా కావడంతో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప తన సొంత నిధులతో రోడ్డుకు మర్మతులు చేయించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని చైర్మన్ నారాయణ అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మిని స్టేడియంలో నవంబరు 3 నుంచి నిర్వహించే కౌటాల ప్రీమియం లీగ్ పోటీల పోస్టర్లను నిర్వహకులు విడుదల చేశారు. కార్యక్రమంలో గోపాల్, శంకర్, దిలీప్, శంకర్, సాయికృష్ణ, వెంకటేష్, శ్రీనివాస్, అక్షయ్, అలీం పాల్గొన్నారు.